ప్రజా సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం

చిగురుమామిడిలో లక్ష కిలోమీటర్ల రథయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

చిగురుమామిడి, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మసమాజ్ పార్టీ (డి.ఎస్.పి) జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ విమర్శించారు. సాగు, తాగునీరు అందించడంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని, అప్పు తెచ్చి సాగు చేసిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట డి.ఎస్.పి ఆధ్వర్యంలో విశారదన్ మహరాజ్ ఈనెల 14న ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్న లక్ష కిలోమీటర్ల రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ యాత్రలో అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలు, 420 హామీలనూ ఎండగట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎలగందుల అనిల్, ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీకాంత్, జిల్లాల సురేశ్, కమిటీ సభ్యులు పైస రాజ్ కుమార్, అందే సాగర్, జ్ఞాన శ్రీ మహారాణి పాల్గొన్నారు.

శ్రీవింద దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, హరిశంకర్ దంపతులకు హెల్త్‌కార్డును అందజేస్తున్న శ్రీవింద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బాధ్యులు

విద్యానగర్, ఏప్రిల్ 6: శ్రీవింద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక రాంనగర్‌లోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాల వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి కల్యాణ వేడుకలకు వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యుడు వొల్లాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, శిబిరంలో పాల్గొన్న వారికి హాస్పిటల్‌కు సంబందించిన రాయితీ హెల్త్ కార్డు అందజేసినట్టు తెలిపారు. ఈ హెల్త్ కార్డును పొందిన వారికి తమ హాస్పిటల్‌లో ఔట్ పేషెంట్ కన్సల్టెన్సీ నుంచి మొదలుకొని ఫార్మసీతోపాటు పలు చికిత్సల్లో రాయితీ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వొల్లాల శ్రావణ్ కుమార్, వొల్లాల సుమభార్గవితో పాటు నగర మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్, దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షులు మల్లికార్జున రాజేందర్, చైర్మన్ చల్ల హరికృష్ణ, హాస్పిటల్ డైరెక్టర్ వొల్లాల శంకర్, సిబ్బంది, కమిటీ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 8 తులాల బంగారం, 20 తులాల వెండి పట్టగొలుసులు అపహరణ

కోనరావుపేట, ఏప్రిల్ 6: మామిడిపల్లి గ్రామంలోని ఒక ఇంట్లో ఎనిమిది తులాల బంగారం, ఇరువై తులాల వెండి పట్టగొలుసులు గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి, మామిడిపల్లి గ్రామానికి చెందిన మహిళ షేక్ హుస్సేన్‌బీ భర్త చనిపోవడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఈనెల 3న అదే గ్రామంలోని పెద్ద కుమారుడు అబ్దుల్ ఇంటికి వెళ్లి అక్కడే ఉండిపోయింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ఈనెల 4న రాత్రివేళ తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. వస్తువులను చిందర వందర చేయడంతో పాటు బీరువాలోని ఎనిమిది తులాల బంగారు అభరణాలు, 20తులాల వెండి పట్టగొలుసులు అపహరించారు. ఆదివారం ఇంటి పక్కన ఉన్న చిన్న కోడలు కింద పడి ఉన్న తాళం చూసి భర్త షబ్బీర్‌కు సమాచార మిచ్చింది. షబ్బీర్ కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి చేరుకుని చోరీ తీరును పరిశీలించారు. బాధితురాలు షేక్ హుస్సేన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండుటెండల్లో మలమల

భానుడు భగభగమండుతున్నాడు. ఉదయం ఏడైందంటే చాలు నింగి నుంచి నేలపై నిప్పులు చెరుగుతున్నాడు. మే నెలలోని ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే నమోదవుతుండడంతో, ప్రజలు బెంబేలెత్తుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనూ ఉపాధి హామీ కూలీలు మాత్రం పనులకు వెళ్తూనే ఉండగా, ఉపాధి హామీ చట్టం ప్రకారం వారికి వేసవి నివారణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కానరాకపోవడంతో, ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం వరకు మండుటెండల్లో కూలీలు మలమలలాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

- పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు కరువైన సౌకర్యాలు
- ఎండవేడికి బేజారవుతున్న మహిళలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అటకెక్కిన ఉపాధి హామీ చట్టం అమలు

కలెక్టరేట్, ఏప్రిల్ 6: జిల్లాలో 1,24,001 జాబ్‌కార్డులుండగా, వీటి ద్వారా 2,32,569 మంది కూలీలుగా నమోదయ్యారు. నిత్యం 14 వేల నుంచి 15.5వేల మంది జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం యాసంగి సాగు దగ్గరపడుతుండగా వ్యవసాయ పనులు తగ్గిన నేపథ్యంలో, రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతున్నది. వీరిలో మహిళల శాతమే అధికంగా ఉండగా, 50 ఏళ్ల పైబడ్డ వారే ఎక్కువ మంది వెళ్తున్నట్లు అధికార వర్గాలే పేర్కొంటున్నాయి. ఉపాధి హామీ చట్టం ప్రకారం వీరికి వీరికి అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే కాగా, క్షేత్రస్థాయిలో నామ్‌కే వాస్తేగా ఏర్పాట్లు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన సమయంలో అవసరమైన టెంట్లు, పనులు చేసేందుకు కావాల్సిన పనిముట్లు కూడా అందజేయాల్సి ఉంటుంది.

కూలీల వెతలు వర్ణనాతీతం

పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించపోవడంతో కూలీల వెతలు వర్ణనాతీతంగా మారాయి. తాగునీరు కూడా తమ ఇళ్ల నుంచే తీసుకెళ్తున్నామని, పని ప్రదేశాల్లో అవసరమైన పనిముట్లు సైతం ఎవరివి వారే తెచ్చుకుంటున్నామని, చెట్ల నీడనే ఆసరా చేసుకునే మధ్యాహ్న భోజనాలు ముగిస్తున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజనానంతరం సేద దీరడం కూడా ఇబ్బందికరంగా మారుతుండగా, ఉపాధి పనులకు వెళ్తున్న అనేక మంది డీ హైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడి, సకాలంలో వైద్య చికిత్స అందక, మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కూలీల సమస్యలు పక్కనబెట్టి అధికారులు, కేవలం పనిదినాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని మండిపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్య చికిత్స అందించే కిట్లు కూడా అందుబాటులో లేకపోవడంతో, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కూలీలు వాపోతున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అయోడిన్, ప్రమాదాల బారిన పడి గాయాలైతే, శుభ్రం చేసేందుకు అవసరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్ అంటి కనీస మందులు కూడా తమ వెంట ఉంచడం లేదని వాపోతున్నారు. ఈసారి ముందుగానే ఎండలు ముదరడంతో, ఈ ప్రభావం కూలీలపై అధికంగా పడే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు కూలీల నుంచి వ్యక్తమవుతున్నాయి. శతకోటి సమస్యలతో సావాసం చేస్తూ ఉపాధి పనులకు వెళ్తున్నా, ఉపాధి చట్టం ప్రకారం ఏటా వేసవిలో చెల్లించాల్సిన అదనపు భత్యం కూడా అటకెక్కించారని ధ్వజమెత్తుతున్నారు.

కూలీల సంక్షేమంపై పట్టింపేది

ఫిబ్రవరి, మార్చి నెలల్లో 15శాతం, ఏప్రిల్‌లో 20 శాతం, మే నెలలో 30 శాతం అదనపు భత్యంగా అందించాల్సి ఉంటుంది. టీఏ, డీఏతో పాటు గడ్డపారకు రూ.10, తట్టకు రూ.5, మంచినీటికి రూ.5, ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే కూలీలకు రూ.20 చొప్పున వారి ఖాతాల్లో జమచేయాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం వీటన్నింటినీ నిలిపివేయడంతో కూలీల బాధలు వర్ణనాతీతంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి కూలీల కోసం అనేక సంక్షేమ చర్యలు తీసుకోగా, పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. ప్రస్తుత ప్రభుత్వం గత రెండు సీజన్ల నుంచి కూలీలపట్ల ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతో తాము ఇక్కట్ల పాలవుతున్నామని మండిపడుతున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని తాము వడదెబ్బ బారిన పడ్డా, అనుకోని ప్రమాదాలకు గురైనా తమ కుటుంబాల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పని ప్రదేశాల్లో చట్టం ప్రకారం కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నం

వేసవిలో ఎండలు మండిపోతుండగా, పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నం. వారికి అవసరమైన వైద్య సామగ్రిని సమీపంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సమకూర్చేలా క్షేత్ర సహాయకులను ఆదేశించాం. నిబంధనలకనుగుణంగా కూలీలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నం.

-శ్రీధర్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 6: బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని భారతీయ బ్రాహ్మణ పరిషత్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణ పరిషత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించలేదన్నారు. విదేశీ విద్య కోసం ప్రతి విద్యార్థికి రూ.40 లక్షలు మంజూరు చేయాలని కోరారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్చక వృత్తిలో కొనసాగుతున్న బ్రాహ్మణులకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకులు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకాన్ని వర్తింప చేయాలని కోరారు.

బీటీ రణదేవ్‌కు నివాళి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 6: సీఐటీయూ తొలి అధ్యక్షుడు బీటీ రణదేవ్ ఆశయాలను కొనసాగిస్తామని జిల్లా అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ పేర్కొన్నారు. నగరంలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఆదివారం బీటీ రణదేవ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మల్లయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, జగదీశ్ పాల్గొన్నారు.

బాల్య స్నేహితుడి కుటుంబానికి అండ

శంకరపట్నం, ఏప్రిల్ 6: మక్త గ్రామానికి చెందిన షేక్ అజీమ్, అతడి తొమ్మిదేండ్ల కొడుకు షేక్ రహమాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబానికి అజీమ్ బాల్య మిత్రులు అండగా నిలిచారు. అంతా ఏకమై ఆ కుటుంబానికి రూ.28,800 నగదు, 75 కిలోల బియ్యం, సరుకులు పోగు చేసి ఆదివారం అందజేశారు.

గంగాధరలో ప్రొటోకాల్ వివాదం

- బూరుగుపల్లి రేషన్ డీలర్ తొలగింపు
- తన భర్త బీఆర్ఎస్ కార్యకర్త కావడంతోనే పక్కన పెట్టారని డీలర్ సరోజ ఆరోపణ

గంగాధర, ఏప్రిల్ 6: గంగాధర మండలంలో ప్రొటోకాల్ వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. ప్రొటోకాల్ పాటించలేదంటూ రెవెన్యూ అధికారులు బూరుగుపల్లి రేషన్ డీలర్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించి ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిచ్చింది. ఈ నెల 2న మంగపేట గ్రామంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన తర్వాతే అన్ని గ్రామాల్లో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని చెప్పినా బూరుగుపల్లి డీలర్ సరోజ ప్రొటోకాల్ పాటించకుండా ముందే బియ్యం పంపిణీ చేసిందని తహసీల్దార్ అనుపమ మూడు రోజుల క్రితం ఆమెను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. స్థానిక మహిళా సంఘానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

రెవెన్యూ అధికారులు తాళం వేసిన రేషన్ దుకాణం

ఆదేశాలుంటేనే పంపిణీ చేశాం

ఈ నెల 1న సన్న బియ్యం పంపిణీ చేయాలని తమకు ఆదేశాలు ఉన్నాయని, అందుకే పంపిణీ చేశానని డీలర్ సరోజ చెబుతున్నారు. అయితే ఉదయం 11:14 గంటలకు బియ్యం పంపిణీ నిలిపివేయాలని డిప్యూటీ తహసీల్దార్ తమ గ్రూపులో మెస్సేజ్ పెట్టడంతో ఆపివేశానని, కానీ అప్పటికే చాలా మంది బియ్యం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా, సన్నబియ్యం పంపిణీ సందర్భంగా స్థానికంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించకపోవడంతో వారి ఒత్తిడి మేరకే తనను విధుల నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. గ్రామంలో మూడు రోజుల క్రితం ఆర్ఐ విచారణ చేసి, ఇచ్చిన నోటీసులో కూడా తాను ఏ తప్పు చేశానో పేర్కొనలేదని, అడిగితే తహసీల్ కార్యాలయానికి రావాలని చెప్పారని ఆరోపించారు. 1న తానే కాదు మండలంలో 25 మంది రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేశారని, కానీ, తన భర్త గడ్డం స్వామి బీఆర్ఎస్ కార్యకర్త కావడంతోనే స్థానిక కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో ప్రొటోకాల్ సాకుతో రెవెన్యూ అధికారులు తనను డీలర్ బాధ్యతల నుంచి తొలగించారని సరోజ ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, ఈ విషయమై తహసీల్దార్ అనుపమను వివరణ కోరగా.. ఈ నెల 2న ఎమ్మెల్యే సత్యం అధికారికంగా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాతే అన్ని గ్రామాల్లో బియ్యం పంపిణీ చేయాలని చెప్పినా ప్రొటోకాల్ పాటించకుండా ఇద్దరు రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేయడంతో వారిని తాత్కాలికంగా తొలగించి ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు.

సప్త సాహితీ పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 6: సాహితీ సోపతి ఆధ్వర్యంలో బహుభాషావేత్త కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ సప్తతి మహోత్సవం సందర్భంగా ఆయన రాసిన.. ఒకేసారి మాటల మూటలు, ప్రణయ హృదయాలు, చెలిమెలు, ఆరు బెంగాలీ కథలు, తెలుగు క్రియా పదకోశం, తెలంగాణ పలుకుబడి, కుండి పుస్తకాల ఆవిష్కరణోత్సవం జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయుడు నగునూరి శేఖర్, ప్రముఖ కవులు, విమర్శకులు, రచయితలు అన్నాడి గజేంద్ర రెడ్డి, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి వాటిని ఆవిష్కరించారు. అన్నవరం దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ డి. రఘురామన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవులు, రచయితలు పాల్గొన్నారు.

వృద్ధులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 6 : జీవన మలిదశలో ఉన్న వృద్ధులు ఆత్మస్థైర్యం పెంపొందించుకుని జీవనం సాగించాలని, తెలంగాణ వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.రాజవీరు సూచించారు. వృద్ధాప్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందుకు సాగాల్సిన తీరుపై ఆదివారం నగరంలోని తీగలగుట్టపల్లిలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో వృద్ధులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, వృద్ధాశ్రమాలు ఏర్పడేందుకు మొదటి కారణం కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులేనన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై తమకు సమాచారమందిస్తే, వారిపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సమాచారమిస్తామన్నారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాధిత వృద్ధులకు న్యాయం జరిగేలా తమవంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మార్కండేయులు, రఘురాములు, వీరవెంకట సత్యనారాయణ, పబ్బోజు వెంకటాచారి, మార్గం వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుపై రాజకీయాలు తగదు

ముస్తాబాద్, ఏప్రిల్ 6 : బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ ఆమోదం పొందని బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది తెలంగాణ బీసీలను మోసం చేస్తూ వారి ఓట్లను దండుకునే ప్రయత్నమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రానికి పంపి చేతులు దులుపుకోకుండా, ఆ ప్రక్రియ పూర్తిగా జరిగేలా చూడాలని కోరారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కంచం నర్సింలు, విశ్వనాథం, అనిల్, మల్లె పూల సాయికృష్ణ, మేర నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★మా కంపెనీలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు 6 గురు కావలెను. వయస్సు: 30 సం॥లోపు వారు. ఉచిత వసతి. ఎలాంటి చదువు అవసరం లేదు. జీతం: 12,000/- నుండి 15,000/- వరకు సెల్: 9849316058.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

41వ డివిజన్‌లో కల్యాణంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బండారు వేణు, భక్తులు

రామడుగు: వెలిచాలలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు దంపతులు

నగరంలోని 13వ డివిజన్‌లో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఉత్సవ నిర్వాహకులు

కమనీయం.. రాములోరి కల్యాణం

కమాన్‌చౌరస్తా/ఇల్లందకుంట/జమ్మికుంట/శంకరపట్నం/చిగురుమామిడి/వీణవంక/మానకొండూర్/రూరల్/గన్నేరువరం/గంగాధర/రామడుగు/కరీంనగర్‌రూరల్/చొప్పదండి/హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 6: శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. నగరంలోని వివిధ ఆలయాలు, కాలనీల్లో అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సాగిన కల్యాణ వేడుకలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నగరంలోని రాంనగర్ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ దంపతులు హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కమాన్ సమీపంలోని రామేశ్వరాలయంలో కల్యాణం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వావిలాలపల్లిలోని రామాలయంలో భరత్ ఆచార్యులు, దేవి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించగా, స్థానిక మాజీ కార్పొరేటర్ మేచినేని వనజా అశోక్ రావు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇక్కడ పలువురు ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. 13వ డివిజన్‌లో హనుమాన్ ఆలయం వద్ద కల్యాణం అట్టహాసంగా నిర్వహించగా, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పారం గోపాల్ రెడ్డి లక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇక్కడ మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వావిలాలపల్లి 41వ డివిజన్‌లో హనుమాన్ ఆలయంలో మాజీ కార్పొరేటర్ బండారు వేణు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే అల్లనూర్‌లో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు. అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట దేవాలయంలో సీతారాముల కల్యాణానికి కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణం తిలకించారు. అలాగే, జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాలు, శంకరపట్నం, చిగురుమామిడి, వీణవంక, మానకొండూర్, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, మానకొండూర్ మండలాల్లోని ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గంగాధర మండలం ఉప్పరమల్యాల తదితర గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. అలాగే చొప్పదండి పట్టణంలో సీతారామ కళ్యాణ మహోత్సవానికి సతీసమేతంగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామంలోని స్వయంభూ శ్రీ స్తంభాల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు–కవిత, వెలిచాల తాజా మాజీ సర్పంచ్ వీర్ల సరోజనా ప్రభాకర్‌రావు, వీర్ల రవీందర్‌రావు, వీర్ల సంజీవరావు, పొన్నం ప్రకాశ్‌గౌడ్, రేగూరి రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

రాంనగర్ సత్యనారాయణ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, హరిశంకర్ దంపతులు, తదితరులు

ఇల్లందకుంటలో స్వామివారికి తలంబ్రాలు, ముత్యాలను తీసుకువస్తున్న సీపీ గౌష్ ఆలం

వావిలాలపల్లిలో నిర్వహించిన రాములోరి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



చొప్పదండి పట్టణంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులు